ప్రజాశక్తి
శనివారం 20 జులై 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



దేశపాత్రునిపాలెంలో ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమి

దేశపాత్రునిపాలెంలో.. భూ మాయ

- రెవెన్యూ రికార్డులు తారుమారు
- డి పట్టా ఇవ్వకపోయినా ఇచ్చినట్లు పేర్లు నమోదు
- ఆక్రమణలో రూ.214 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి
- వారితో జతకలిసిన రెవెన్యూ సిబ్బంది

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, పరవాడ విలేకరి

జిల్లాలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు ఆగడంలేదు. ప్రభుత్వాలు ఏమొచ్చినా ఆక్రమణదారులు వెనక్కుతగ్గడంలేదు. కొంతమంది రెవెన్యూ సిబ్బంది సహకారంతో ప్రభుత్వ భూమిపై హక్కు వున్నట్లు రికార్డులో నమోదు చేసుకొని, ఆ రికార్డుల ఆధారంగా కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని అనుభవించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. పరవాడ మండలం దేశపాత్రునిపాలెం రెవెన్యూలో రూ.214.08 కోట్ల విలువైన 44.60 ఎకరాల భూమి ప్రభుత్వం ఎవరికీ అసైన్ చేయకపోయినా, అసైన్ చేసినట్లు రికార్డుల్లో నమోదు చేయించారు. దేశపాత్రునిపాలెంలోని వివిధ సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూముల ఆక్రమణ వ్యవహారం విఆర్ఓ నుంచి తహశీల్దార్ వరకు తెలిసినా.. పట్టించుకోకపోవడం ఆక్రమణదారులకు కలిసొచ్చినట్లయింది. కలెక్టర్, ఆర్‌డిఒలకు స్థానికులు పలుసార్లు ఫిర్యాదుచేసినా ప్రభుత్వ భూమిని కాపాడుకోవాలన్న ఆలోచన రెవెన్యూ అధికారులకు లేకపోవడంతో విలువైన భూమి ప్రయివేటు వ్యక్తుల పరమవుతోంది. ఈ భూములపై సిట్‌కు కూడా ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది.

జిల్లాలోని పరవాడ మండలం, దేశపాత్రునిపాలెం రెవెన్యూలో సర్వే నెంబరు 74/2లో 3.50 ఎకరాలు. 75/1ఎల్‌లో 6.15 ఎకరాలు, 72/1డిలో 2.86 ఎకరాలు, 85/1బిలో 2.70 ఎకరాలు, 207/2లో 3.78 ఎకరాలు, 207/5లో 2.35 ఎకరాలు, 75/1బిలో 89 సెంట్లు, 75/1సిలో 87 సెంట్లు, 317/2లో 78 సెంట్లు, 75/1ఇక్యూలో 2.05 ఎకరాలు, 84/క్యూలో 72 సెంట్లు, 187/2లో 1.75 ఎకరాలు వెరసి 28.4 ఎకరాల భూమి పేదలకు ప్రభుత్వం ఇవ్వకుండా ఆ భూమి అసైన్‌మెంట్ చేసినట్లు ఆక్రమదారుల పేరిట పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేశారు. వాస్తవానికి 28.4 ఎకరాల ప్రభుత్వ భూమి దేశపాత్రునిపాలేనికి చెందిన ఒక కుటుంబం చేతుల్లోనే వుంది.

ఇక్కడ ఎకరా దాదాపు 4.80 కోట్ల విలువ వుంది. దీని ప్రకారం 28.4 ఎకరాల విలువ రూ.136.32 కోట్లు ఉంటుంది. ఇంత విలువైన భూమి ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు మౌనం దాల్చడం విమర్శలకు తావిస్తోంది. పట్టాలిచ్చినట్లు రెవెన్యూ అసైన్‌మెంట్ రికార్డుల్లో లేనప్పటికీ 2008, 2009 సంవత్సరాల్లో మిగతా 2లో..



చావులమధుం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న నీటిలోనే సాగుతున్న రాకపోకలు

ఎడతెరిపి లేని వాన

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- తీరంలో పెరిగిన అలల తాకిడి
- పలుచోట్ల నేలకొరిగిన చెట్లు
- రాకపోకలకు అంతరాయం
- అనకాపల్లి జిల్లాలో జలాశయాల్లోకి వరద నీరు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, అనకాపల్లి ప్రతినిధి

ఉత్తరాంధ్ర, ఒడిశాల్లో అల్పపీడనం కేంద్రీకృతం కావడంతో విశాఖలో శుక్రవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. నగరంలో పలుచోట్ల రోడ్లన్నీ జలమయమయ్యాయి. రోడ్లపైగల గుంతల్లోకి వర్షపు నీరు చేరడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. మద్దిలపాలెం నుంచి షీలానగర్‌కు వెళ్లే జాతీయ రహదారిపై పలుచోట్ల నీరు నిలిచిపోయింది. పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. రాకపోకలకు కాసింత అంతరాయం ఏర్పడింది. ఆరిలోవ, గాజువాక కొండవాలు ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడ్డాయి. కెఆర్ఎం కాలనీ, ఒన్‌టౌన్ ఏరియా, మాధవదార, ఆరిలోవ, సుభాష్‌నగర్, కొండవాలు ప్రాంతాలన్నింటా పాత భవనాలు తడిసి ముద్దయినట్లు అధికార యంత్రాంగం మిగతా 2లో..

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

▶ వార్త 2లో..

ఎయు పరిపాలనా భవనం వద్ద ఇనుప గేట్ల తొలగింపు

▶ వార్త 8లో..

కోయంబత్తూరు - దానాపూర్ మధ్య ప్రత్యేక రైలు

▶ వార్త 8లో..

గిరి ప్రదక్షిణకు పటిష్ట ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శనివారం గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా జిల్లా యంత్రాంగం సమగ్ర ఏర్పాట్లు చేయాలని, శుక్రవారం రాత్రి నాటికే అవి పూర్తి కావాలని వివిధ విభాగాల అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం వివిధ విభాగాల అధికారులతో ఆయన తన కార్యాలయం నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా డిపార్టుమెంట్ల ఆధ్వర్యంలో ఇప్పటి వరకు జరిగిన ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. తగిన సూచనలు చేశారు. మార్గదర్శకాలు జారీ చేశారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం వహించి వేడుకను విజయవంతం చేయాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం ఎక్కడికక్కడ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గిరిప్రదక్షిణ సాగే 32 కిలోమీటర్ల పరిధిలో ప్రతి కౌంటర్ వద్దా తగినంత మంది సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని, తగినన్ని మందులు, ఒఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని చెప్పారు. జోడుగుళ్లపాలెం, మిగతా 2లో..

మంత్రి శ్రీనివాస్ సుడిగాలి పర్యటన

ఎంఎస్ఎంఇ శిక్షణ కేంద్రం, మెడ్‌టెక్ జోన్‌ల పనితీరుపై సమీక్ష

ప్రజాశక్తి - అచ్యుతాపురం, ఉక్కునగరం విలేకరులు

రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. అచ్యుతాపురం సెజ్‌లో ఉన్న ఎంఎస్ఎంఇ శిక్షణా కేంద్రాన్ని సందర్శించి అక్కడి కార్మికులు, ఉద్యోగులతోనూ, శిక్షణ పొందుతున్న విద్యార్థులతోనూ సమావేశమయ్యారు. శిక్షణా కేంద్రం పనితీరును సమీక్షించారు. విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంఎస్ఎంఇ శిక్షణ కేంద్రాలు పెట్టేందుకు పరిశీలన జరుపుతున్నామని తెలిపారు. ఉక్కు నగరం పరిధిలో ఉన్న ఎపి మెడిటెక్ జోన్‌నూ సందర్శించారు. అక్కడ వివిధ కంపెనీల ఆపరేషన్స్ ప్రక్రియలను పరిశీలించారు. వైద్య పరికరాల తయారీకి సంబంధించిన వివిధ కంపెనీలను సందర్శించిన ఆయన వివిధ కంపెనీల సిఇఒలతో భేటీ అయ్యారు. అక్కడున్న వసతులు, కంపెనీలు, ఉద్యోగులు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిశ్రమల శాఖ మిగతా 2లో..



మెడ్‌టెక్ జోన్‌లో కంపెనీల పనితీరును పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్

మొదటి పేజీ తరువాయి..

దేశపాత్రునిపాలెంలో భూ మాయ

దేశపాత్రునిపాలేనికి చెందిన గంట్ల మూలారావు, గంట్ల మూలయ్య, మునగపాకలోని పల్లపు ఆనందపురం గ్రామానికి చెందిన తిర్రి వరహాలమ్మ, పెందుర్తి మండలానికి చెందిన రాచపల్లి రామమోహనరావు, పరవాడ మండలం కలపాకకు చెందిన మొల్లి కనకరాజు, స్థానికేతరులైన మదేద జోన్స్ విజయ్, మహ్మద్ మజ్ అరక్ హుక్ పేరున పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరుచేయడంతో పాటు వెబ్‌ల్యాండ్, 1బి రికార్డులో పేర్లు నమోదుచేశారు. అలాగే దేశపాత్రునిపాలెం సర్వే నెంబరు 75/1కెలో 4.84 ఎకరాలు, 80/2బిలో 1.36 ఎకరాలు, 356/1లో 5 ఎకరాలు, 357/1లో 5 ఎకరాలు వెరసి రూ.77.76 కోట్ల విలువైన 16.2 ఎకరాల ప్రభుత్వ భూమి అసైన్ చేయకుండానే డి ఫారం భూముల రికార్డులో నమోదుచేశారు.



ఆర్‌కె బీచ్‌లో ఎగసిపడుతున్న అలలు

ఎడతెరిపి లేని వాన

నివేదికలు తయారు చేసింది. అక్కడివారిని అప్రమత్తం చేసింది. మరోవైపు విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి సరఫరాకు ఎటువంటి అంతరాయమూ కలగకుండా చూస్తున్నారు. అల్పపీడనం శనివారానికి వాయువ్య దిశగా ప్రయాణం చేసి పూరీ సమీపంలోని ఒడిశా తీరాన్ని దాటే అవకాశాలుండడంతో మరో 24 గంటల పాటు వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు విశాఖపట్నం వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. వారి సమాచారం మేరకు విశాఖలో రాగల 24 గంటల్లో పలు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలకు అవకాశాలున్నాయి. గాలుల తీవ్రత గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఉంటాయి. ఇప్పటికే తీరంలో అలలు ఎగిసిపడుతున్నాయి. ఉష్ణోగ్రతలు శుక్రవారం విశాఖలో ఒక్కసారిగా 25 డిగ్రీలకు పడిపోయాయి.

వర్షాలతో అనకాపల్లి జిల్లాలోని జలాశయాల్లోకి నీరు వచ్చి చేరింది. తాండవలో 509 క్యూసెక్కులు, రైవాడలో 460, కోణాంలో 20, వరహాలో 70, పెద్దేరులో 125 క్యూసెక్కుల నీరు చేరింది. ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లా వ్యాపితంగా 30.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గురు, శుక్రవారాల్లో అత్యధికంగా పరవాడలో 108.9, మునగపాకలో 96.2, కశింకోట మండలంలో 94.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యల్పంగా గొలుగొండ మండలంలో 21 మిల్లీమీటర్లు నమోదైంది. అనకాపల్లి ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్‌లోకి నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధాన రహదారుల్లో నీరుపారడంతో రాకపోకలకు అవస్థలుపడ్డారు. రెండ్రోజుల పాటు కురిసిన వర్షాలతో చెరువుల్లో కొద్దిగా నీరు చేరింది. ఖరీఫ్ పంటల సాగుకు ఈ వర్షాలు దోహదపడనున్నాయి.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూములు ఏర్పాటు

విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్ విభాగంలో తుపాను కంట్రోల్ రూములను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 0891 - 2590102, 0891 - 2590100 ఫోన్ నెంబర్లతో పని చేస్తుందని తెలిపారు. ఆ నెంబర్ల ద్వారా తుపాను పరిస్థితుల సమాచారాన్ని ప్రజలు పొందవచ్చని, అలాగే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని తాజా పరిస్థితులను తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

మంత్రి శ్రీనివాస్ సుడిగాలి పర్యటన

అధికారులు, మెడిటెక్ జోన్ ప్రతినిధులు అక్కడున్న వివిధ కంపెనీలను చూపించారు. వాటి ద్వారా ఉత్పత్తయ్యే పరికరాలు, మార్కెటింగ్ ట్రెండ్ ఇతర అంశాల గురించి వివరించారు. మంత్రి వెంట విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పరిశ్రమల శాఖ అధికారులు గణపతి, శ్రీధర్ ఉన్నారు.

గిరి ప్రదక్షిణకు పటిష్ట ఏర్పాట్లు

అప్పుఘర్ వద్ద సముద్ర భాగంలో బోట్లను నిలిపి ఉంచాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఒక వేళ వర్షాలు, అలల ధాటి ఎక్కువైతే గనుక జోడుగుళ్లపాలెం, అప్పుఘర్ వద్ద భక్తులను స్నానాలకు అనుమంతించరాదని స్పష్టం చేశారు. స్నాన ఘట్టాల వద్ద దుస్తులు మార్చుకునేందుకు తగినన్ని గదులు సమకూర్చాలని సూచించారు. మెడికల్ క్యాంపు, అంబులెన్స్, తాగునీరు, టాయిలెట్లు, ఇతర హెల్ప్ లైన్ నెంబర్లను దారిపొడువునా డిస్‌ప్లే చేస్తూ హోర్డింగులు పెట్టించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యుత్తు లైట్లను అమర్చాలని, వర్షం వల్ల అవిపోతే వెంటనే రిప్లేస్ చేసేలా సన్నద్ధం కావాలని చెప్పారు. సిసి కెమెరాలు అమర్చాలని, వాటిని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలని అన్నారు. వర్షం ఎక్కవైతేగనుక భక్తులు మెట్ల మార్గం ద్వారా కాకుండా బస్సుల్లో కొండపైకి చేరుకొనే అవకాశం ఉన్నందున ఆ మేరకు అదనంగా ఆర్టీసీ బస్సులను ఉంచుకోవాలని స్పష్టం చేశారు. ఎడిసిలు విశ్వనాథన్, శ్రీనివాసరావు, ఆలయ ఇఒ శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, జివిఎంసి,రెవెన్యూ, వైద్యారోగ్య, ఇతర శాఖల అధికారులు టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసి పూర్తి సామర్థ్యంతో నడపాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1254వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఎఫ్ఎండి, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్, సిఎంఇ, విఎస్‌జిహెచ్, ప్లాంట్ డిజైన్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ సెయిల్‌లో విలీనం చేసే విషయంలో ప్రభుత్వాల తాత్సారం తగదన్నారు. ఉద్యోగులకు, కార్మికులు వేతనాలను సకాలంలో ఇవ్వకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలో భాగంగానే మూడున్నర సంవత్సరాలుగా రా మెటీరియల్ విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. వేల కోట్లతో ఏర్పాటు చేసిన ఉత్పత్తి విభాగాలను ముందస్తు ప్రణాళిక లేకుండా మూసివేయడంతో భారీ యంత్రాలు పనికి రాకుండా పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీక్షల్లో నాయకులు పి.రామకృష్ణరాజు, ఎంఎన్.రావు, పిజికె.రాజు, కెఎన్.సచారావ్, డి.మధు పాల్గొన్నారు.



దీక్షల్లో కూర్చున్న పోరాట కమిటీ నాయకులు

ఫ్యాప్సీ విశాఖ అధ్యక్షునిగా కంకటాల మల్లికార్జునరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నంలోని కంకటాల టెక్స్‌టైల్స్ ఛైర్మన్ కంకటాల మల్లికార్జునరావు శుక్రవారం విశాఖలో జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫ్యాప్సీ) ఐదో వార్షిక సర్వసభ్య సమావేశంలో విశాఖపట్నం అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. మల్లికార్జునరావు ఎవిఎన్ కళాశాల నుంచి బ్యాచిలర్ ఆఫ్ సైన్స్, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్ ఆఫ్ లా పట్టా పొందడంతో పాటు పన్నుల సబ్జెక్టులో బంగారు పతకాన్ని కూడా అందుకున్నారు. కంకటాల మల్లిక్‌గా పేరుగాంచిన మల్లికార్జునరావు విశాఖపట్నానికి చెందిన డైనమిక్ వ్యాపారవేత్త, టెక్స్‌టైల్‌లో ప్రత్యేకమైన పట్టు చీరలకు ప్రసిద్ధి చెందిన 16 రిటైల్ అవుట్‌లెట్‌లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, న్యూఢిల్లీలలో స్థాపించారు. అంతేకాకుండా ఆయన 2004లో భవన నిర్మాణంలో తన వ్యాపార కార్యకలాపాలను విస్తరించారు. ఆయన ఇప్పటికే విశాఖపట్నం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షునిగానూ, విశాఖపట్నం క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షునిగానూ ఉన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరంలలో అనేక సామాజిక సంస్థల కార్యకలాపాలకు ఆయన సహకారాన్ని అందిస్తున్నారు.



మల్లికార్జునరావు

విఎంఆర్‌డిఎ
సాంకేతిక విభాగం పనితీరుపై సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ సాంకేతిక విభాగం పనితీరుపై మెట్రోపాలిటన్ కమిషనర్ రవీంద్ర శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న మల్టీలెవల్ కార్ పార్కింగ్ ప్రాజెక్ట్, ఎన్ఎడి ఫ్లై ఓవర్ వద్ద నిర్మిస్తున్న రైల్ ఓవర్ వంతెన, ఎండాడ, చీమలాపల్లిల్లో నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రధాన ఇంజినీర్ భవానీ శంకర్, పర్యవేక్షక ఇంజినీర్ బలరామరాజు, కార్యనిర్వహక ఇంజినీర్లు, ఉప కార్యనిర్వహక ఇంజినీర్లు, సహాయక ఇంజినీర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల కోసం ప్రిజన్ టు ప్రైడ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జైలు ఖైదీలు, జువెనైల్ కోసం 'ప్రిజన్ టు ప్రైడ్' ఫేజ్ 8, 'నయీ దిశా - స్మైల్ ఫర్ జువెనైల్' ఫేజ్ 5 ప్రారంభించినట్టు ఇండియన్ ఆయిల్ సంస్థ తెలిపింది. ఈ మేరకు విశాఖ కేంద్రంగా సంస్థ ప్రతినిధి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఖైదీలు, బాల నేరస్తులలో పరివర్తన కోసం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. తద్వారా 22 జైళ్లు, జువైనల్ హోమ్‌లలో వెయ్యి మందికి పైగా వ్యక్తుల జీవితాలను స్పృశించనున్నామని తెలిపారు. ఈ రోల్ అవుట్‌తో ఇండియన్ ఆయిల్ 23 రాష్ట్రాలు, 6 కేంద్ర పాలిత ప్రాంతాలలో 15 మహిళా బాల్య కేంద్రాలతో సహా 150 సంస్థలలో 7300 మంది ఖైదీలు, బాల్య జీవితాల్లో స్పోర్ట్స్ కోచింగ్, పరికరాలను అందించడానికి సిద్ధంగా ఉందన్నారు.

రాష్ట్ర జైళ్ల శాఖల సహకారంతో ఇప్పటికే 53 ఇంధన స్టేషన్లను ప్రస్తుత, మాజీ ఖైదీలచే నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

నేడు విదేశీ విద్యపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విదేశీ విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులకు కోర్సులు, వీసాలు, స్కాలర్‌షిప్ తదితర అంశాలపై పూర్తి అవగాహన కల్పించేందుకు ఈ నెల 20న విదేశీ విద్యా నిపుణులతో అవగాహనా సదస్సు నిర్వహించనున్నట్లు ఓక్స్ ఓవర్సీస్ సంస్థ సిఇఒ సతీష్ తెలిపారు. విశాఖలోని వారి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సీనియర్ క్లయింట్ రిలేషన్ షిప్ మేనేజర్ షరీఫ్, సీనియర్ కౌన్సిలర్లు మల్లికార్జునరావు, ధన్‌రాజ్‌లతో కలిసి సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శనివారం నగరంలోని రైల్వే డిఆర్ఎం కార్యాలయం ఎదురుగా ఉన్న ది బెస్ట్ వెస్టర్న్ ప్లస్ హోటల్‌లో నిర్వహించే సదస్సులో 15 సంవత్సరాల అనుభవంగల కౌన్సిలర్లు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ఎటువంటి ఫీజు లేదని తెలిపారు. సదస్సులో విదేశీ విశ్వవిద్యాలయాల్లో స్టడీ వీసా, స్కాలర్‌షిప్, విజిట్ వీసా, కెనడా ఇమ్మిగ్రేషన్, విదేశాల్లో ఎమ్‌బిబిఎస్, మెడిసిన్‌లో పీజీ, యుకె టయర్ 2 వీసా, జాబ్ సీకర్ వీసా, విజిట్ వీసా, విద్యార్థుల డిపెండెంట్ వీసాల కోసం అవగాహన కల్పించి సందేహాలను నివృత్తి చేస్తామని తెలిపారు.

ప్రాణాలు పోతున్నా పట్టదా..?

- ప్రమాదాలకు నెలవుగా గవరగెడ్డ బ్రిడ్జి
- అర్థాంతరంగా ఆగిన పనులతో అవస్థలు
- బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్న ఆబోతువానిపాలెం వాసులు



కోతకు గురై ఒకరి ప్రాణాలు బలిగొన్న ప్రమాదభరిత డైవర్షన్



ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని శొంఠ్యాం పంచాయతీ ఆబోతువానిపాలెం గ్రామానికి వెళ్లే రహదారిలో గవర గెడ్డ వద్ద అరకొర నిర్మాణంతో ఆగి ఉన్న వంతెన ప్రమాదాలకు నెలవుగా మారిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ వంతెన నిర్మాణానికి రూ.1.51కోట్ల ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు ఆర్థికసాయంతో నిధులు మంజూరుకాగా, 2023 మార్చి నెలలో కర్నూలు ఆళ్లగడ్డకు చెందిన శ్రీ దస్తగిరి కనస్ట్రక్షన్ కంపెనీ టెండరింగ్ ద్వారా అనుమతి పొంది రోడ్డు , వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆబోతువానిపాలెం నుంచి కణమాం వరకు 1.40కిలోమీటర్లు రోడ్డు నిర్మాణంతోపాటు గవరగెడ్డపై వంతెన నిర్మాణం చేపట్టి, ఈ ఏడాది ఆగస్టు 29లోగా పనులు పూర్తిచేయాల్సి ఉంది.అయితే పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి, మొదట్లో శరవేగంగా పనులు చేపట్టినప్పటికీ, చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లించక పోవడంతో, కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. దీంతో గడువు దాటి నాలుగు నెలలు గడుస్తున్నా నేటికీ పూర్తిచేయని పరిస్థితి ఉంది.

బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా అబోతువానిపాలెం వాసుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రెండు పైపులతో డైవర్షన్ ఏర్పాటుచేశారు. అలాగే వంతెన నిర్మాణానికి సంబంధించి పిల్లర్ల పనులు కూడా జరిగాయి. ఇక పైకప్పు, ఫినిషింగ్ పనులు చేపట్టి, పూర్తిచేయాల్సిన స్థితిలో అర్థాంతరంగా నిర్మాణం ఆపేసి నెలల తరబడి పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆవేదన చెందుతున్నారు.



పిల్లర్ల స్థాయిలోనే నిలిచిన బ్రిడ్జి నిర్మాణం

మరోవైపు అరకొర పనులతో ఆగిపోయిన వంతెన వద్ద ఇపుడు ప్రమాదభరిత పరిస్థితులున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వర్షాలకు పైపులతో వేసిన డైవర్షన్‌లోని మట్టి కొట్టుకుపోవడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని వాపోతున్నారు. కొద్దిరోజుల క్రితం ఆబోతువానిపాలెం గ్రామానికి చెందిన చల్లా వీరాస్వామి(37) అని యువకుడు బైక్‌పై వస్తుండగా డైవర్షన్ వద్ద అదుపుతప్పి ప్రమాదానికి గురై మృతి చెందడంతో ఈ మార్గంలో రావాలంటే ప్రజలు భయపడే పరిస్థితి ఉది. మరిన్ని ప్రమాదాలు జరగకముందే ఆబోతువానిపాలెం గ్రామానికి వెళ్లే మార్గంలో గవరగెడ్డ బ్రిడ్జిని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పిఆర్ జెఇఇ వివరణ

దీనిపై సంబంధిత పిఆర్ జెఇఇ శ్రీనివాసరావును వివరణ కోరగా బ్రిడ్జి నిర్మాణ పనులకు సంబంధించి సంబంధిత కాంట్రాక్టర్‌కు రూ.50లక్షల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉందని, దీనికి సంబంధించిన నిధులు విడుదల కాకపోవడంతో పనులను మధ్యలోనే వదిలేసారన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించి బ్రిడ్జి, రోడ్డు నిర్మాణం పనులు చేపడతామని తెలిపారు

డయేరియాపై వైద్యసిబ్బంది అప్రమత్తం



జగన్నాథపురంలో ఇంటింటా వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - ఆనందపురం: మండలంలోని చందక పంచాయితీ జగన్నాథపురంలో డయేరియా కేసులు గుర్తించడంతో వైద్యసిబ్బంది పూర్తి అప్రమత్తమైంది. శుక్రవారం ఇంటింటా సర్వే చేపట్టి, డయేరియా పీడితులెవరైనా ఉన్నారాయని ఆరా తీశారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టి, బ్లీచింగ్ చల్లారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. ఆనందరావు డయేరియా పీడితుల ఇళ్లకు వెళ్లి, వారు తీసుకున్న ఆహారంపై వివరాలు తెలుసుకుని, శాంపిళ్లను సేకరించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల వద్ద వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ గంగునాయుడు ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది గురువారం అర్థరాత్రి వరకు సేవలు అందిచడంతోపాటు శుక్రవారం సేవలను కొనసాగించారు.

ఎంపిడిఒ నల్లారి అప్పలనాయుడు గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇఇ ఎస్ఎస్ఆర్ మూర్తి రక్షితనీటి పథకాన్ని పరిశీలించి, ట్యాంకులో క్లోరినేషన్ చేయించారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో వెల్లంకి ఎస్‌బిఐలో అగ్నిప్రమాదం

త్రుటిలో తప్పిన భారీ ఆస్తి నష్టం

అద్దె భవనంలో బ్యాంకు నిర్వహణ

అవసరానికి అందుబాటులో లేని సిబ్బంది



బ్యాంకు భవనంలోంచి వస్తున్న పొగలు, కాలిపోయిన పత్రాలు

ప్రజాశక్తి -ఆనందపురం: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో వెల్లంకి స్టేట్‌బ్యాంకులో శుక్రవారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. ఉదయం ఏడున్నర గంటలకు బ్యాంకు నుంచి పొగలు రావడంతో స్థానికులు, డాక్యుమెంట్ రైటర్ మరిపిల్లి శ్రీనివాసరావు గమనించి, చిట్టివలస అగ్నిమాపక సిబ్బందికి, బ్యాంక్ మేనేజర్ కెవి శ్రీధర్‌కు సమాచారం అందించారు. పెందుర్తి నుంచి బ్యాంకు మేనేజర్ శ్రీధర్ వచ్చి తాళాలు తీసేసరికి విద్యుత్ వైర్లు కాలిపోవడంతో భవనం నిండా పొగలు కమ్ముకున్నాయి. ఎస్‌హెచ్‌ఒ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో విద్యుత్ వైర్లన్నీ కాలిబూడిదవ్వడంతోపాటు, కొన్ని రశీదులు కాలిపోయాయని ప్రాథమికంగా గుర్తించారు. ఆ పక్కనే ఉన్న స్టోర్‌రూం, లాకర్లకు మంటలు వ్యాపించక పోవడంతో పెద్దప్రమాదమే త్రుటిలో తప్పింది. లేకుంటే లాకర్లలోని విలువైన పత్రాలు, బంగారంతోపాటు బ్యాంకు రికార్డులు కాలిబూడిదయ్యేవని అంటున్నారు.

భద్రతలో నిర్లక్ష్యం? : భయాందోళనలో స్థానికులు

మంటలు చెలరేగిన ఎస్‌బిఐ భవనానికి తాళాలు వేసి ఉండడం, విద్యుత్‌వైర్లు లోపలే ఉండిపోవడం, అందుబాటులో బ్యాంకు సిబ్బంది ఎవరూ లేకపోవడంతో అగ్నిప్రమాదాన్ని గుర్తించినా, ఫైర్‌సిబ్బందితోపాటు ఎవరూ లోపలికి వెళ్లలేని పరిస్థితిలో బ్యాంకు మేనేజర్ వచ్చేవరకు వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. వందలాదిమంది వినియోగదారులు, దాదాపు రూ.వంద కోట్ల లావాదేవీలు జరిగే వెల్లంకి బ్యాంకును అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. దానికి సరైన భద్రత,రక్షణ చర్యల్లేకపోవడం, నాణ్యమైన విద్యుత్ వైరింగ్ లేకపోవడం, షార్ట్‌సర్క్యూట్ జరిగినప్పుడు ట్రిప్ కాకపోవడం వంటి కారణాలే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. ఇప్పటికైనా తగు భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మలేరియా కేసుల నమోదుతో అప్రమత్తత



హాస్టల్‌లో గిరిజన విద్యార్థినులతో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి -పిఎం పాలెం: మారికవలస సమీపంలోని ఎపి గిరిజన సంక్షేమ బాలికల బాలికల హాస్టల్ లో ఇద్దరు విద్యార్థినులకు మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తమైంది. శుక్రవారం హాస్టల్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, సందర్శించారు. హాస్టల్‌లోని పరిస్థితులను,వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసర ప్రాంతాలలో నీరు నిల్వ లేకుండా చూడాలని, ఓవర్‌హెడ్ ట్యాంకులోని నీటికి తరచూ క్లోరినేషన్ చేయించాలని, విద్యార్థినులంతా విధిగా దోమతెరలు వాడేలా చర్యలు చేపట్టాలని హాస్టల్ వార్డెన్‌కు సూచించారు.జ్వరాలు ప్రబలిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా ఆసుపత్రికి తీసుకెళ్లి తగు వ్యాధినిర్ధారణ పరీక్షలతోపాటు వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు.

యుపిహెచ్‌సి సందర్శన

అనంతరం మారికవలస పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. యుపిహెచ్‌సిలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను, అడల్ట్ బిసిజి.వాక్సినేషన్, సెషన్ ప్లానింగ్, లబ్దిదారుల జాబితా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేసారు. రక్తహీనత లబ్ధిదారులను, గర్భిణులను గుర్తించి, వారికి ఐరన్ మాత్రలు ఇవ్వాలని, పౌష్టికాహారం తీసుకునేలా చైతన్యపరచాలని ఎఎన్ఎం, ఆశాలు, హెల్త్ సూపర్‌వైజర్లకు సూచించారు. ఆసుపత్రుల్లో సాదారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, సి-సెక్షన్ ప్రసవాలు నివారించాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించి, రోగులకు అందుబాటులో ఉండి ఎటువంటి ఆరోపణలు రాకుండా వైద్యసేవలు అందించాలని సూచించారు. కీటక జనిత వ్యాధులు, స్టాప్ డయేరియా ప్రోగ్రాంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడే సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ తులసిరాజ్, డిఎంఒ, ఎఎంఒ, మలేరియా సిబ్బంది, ఎంపిహెచ్‌ఇఒ నాగభూషణం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

భవనంపై నుండి పడి కార్మికుడు మృతి

ప్రజాశక్తి-పరవాడ : మండల కేంద్రం పరవాడలో మూడంతస్తుల భవనంపై తాపీ పనిచేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పరవాడ గ్రామంలో నివాసం ఉంటున్న విజయనగరం జిల్లా మక్కువ గ్రామానికి చెందిన అమరపు సురేష్ (32) గురువారం ఉదయం తాపీ పని నిమిత్తం పరవాడ గ్రామంలోని ప్రసాద్ సూపర్ మార్కెట్ వెనక ఉన్న బండారు సింహాచలం నాయుడు ఇంటి నిర్మాణం పనికి వెళ్లారు. అక్కడ మేస్త్రి పనిచేస్తుండగా మధ్యాహ్నం సుమారు 3.40 గంటల సమయంలో మూడో ఫ్లోర్ నుండి ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతో అతని తలకు బలమైన గాయమైంది. దీంతో ఆయన్ను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఏరియా హాస్పిటల్‌కి తరలించారు. అక్కడ డ్యూటీ డాక్టర్ పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని భార్య పరవాడ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయగా సిఐ బాల సూర్యారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యాచకురాలు మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు ఆదర్శనగర్‌లో గురువారం కళ్లుతిరిగి పడిపోవడంతో అస్వస్థతకు గురైన 75 ఏళ్ల యాచకురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో కెజిహెచ్‌లో మృతి చెందింది. గురువారం అస్వస్థతకు గురైన యాచకురాలిని, స్థానిక మహిళ ఇచ్చిన సమాచారం మేరకు 108 అంబులెన్స్‌లో కెజిహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్టు ఆరిలోవ పోలీసులు తెలిపారు కొన్నాళ్లుగా ఆదర్శనగర్ పరిసరాల్లో భిక్షాటనతో జీవనంసాగిస్తున్న ఆమెకు సంబంధీకులెవరూ లేకపోవడంతో, స్వచ్ఛంద సంస్థల సహకారంతో శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు పోలీసులు తెలిపారు.

చైన్ స్నాచింగ్ కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి -భీమునిపట్నం : బంగారు చైన్లు తెంచుకుపోయి, దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితులను స్థానిక నేర విభాగం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు.వారి నుంచి చోరీ సొత్తును, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు

నేర విభాగం ఎస్ఐ సూర్య ప్రకాశరావు అందించిన వివరాలివి. భీమిలి మండలం, దాకమర్రి గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఆరిలోవకు చెందిన బడిగంటి ప్రణీత సైని ఏప్రిల్ 16న దాకమర్రి జంక్షన్‌లో బస్సు దిగి డ్యూటీకి వెళ్తుండగా బైక్‌పై వచ్చి ఆమె మెడలోని అరతులం బంగారం చైను తెంచుకుపోయాడు.

విజయనగరం జిల్లా, చీపురుపల్లికి చెందిన వాడరేవు సుజాత, ఈనెల 7న సంగివలసలోని శశిస్కూల్‌లో చదువుతున్న కుమారుడి చూసేందుకు వచ్చి, తిరుగు ప్రయాణంలో భాగంగా బస్సు కోసం ఎదురుచూస్తున్న ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడును, బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు చోరీ చేశారు. బాధితులు ఫిర్యాదు మేరకు నేర విభాగం సిఐ జి రాంబాబు ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్ సూర్యప్రకాశరావు, ఇతరసిబ్బందితో ప్రత్యేక బృందాలుగా గాలింపు చేపట్టి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి మూడు తులాల బంగారు ఆభరణాలు రికవరీ చేశారు.

నిందితులిద్దరూ పాత నేరస్తులే...

ఈ రెండు కేసుల్లోనూ నిందితులు పాత నేరస్తులే. నగరంలోని చైతన్య నగర్‌కు చెందిన గారి గంగులు, మద్దిలపాలేనికి చెందిన కోయిలాడ సాయి కిరణ్‌లను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. వీరిపై టూటౌన్, ఎంవిపి పోలీస్‌స్టేషన్లలో కొట్లాట, డెకాయిట్ కేసులున్నాయి.

ఎన్‌సిసి క్యాడెట్ల ప్రతిభ

ప్రజాశక్తి-సీతమ్మధార: శాలకు చెందిన ఎన్‌సిసి విద్యార్థులు పలు ఈవెంట్లలో సత్తాచూపి, పతకాలను సాధించారు 4ఎ నావెల్ మెడికల్ యూనిట్‌లోని 9 ఎస్‌డబ్ల్యూఎస్ సీనియర్ వింగ్, 20 ఎస్‌డిఎస్ సీనియర్ డివిజన్‌లో లోకోడెట్‌లో పతకాలు సాధించారు. అలాగే 3ఏ నావల్ యూనిట్ నుంచి ఫైరింగ్‌లో స్వర్ణ పతకం దక్కింది. ప్రతిష్టాత్మకమైన ఐజిసి 4ఎ నావెల్ మెడికల్ యూనిట్ క్యాడెట్లు వరుసగా రెండవ ఏడాది ట్రోఫీని గెలుచుకున్నారు వీరిలో ఆరుగురు క్యాడెట్లు ఎన్‌సిసి శిక్షణ శిబిరానికి ఎంపికయ్యారు. ప్రతిభ చూపిన ఎస్‌సిసి క్యాడెట్లను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జి మధుకుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

స్టీల్ కార్మికుల వేతన బకాయి చెల్లించాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్ కార్మికులకు బకాయి పడ్డ మూడునెలల వేతనాన్ని యాజమాన్యం తక్షణం చెల్లించాలని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం స్టీల్ సిఐటియు కార్యాలయంలో కార్యవర్గం సమావేశంలో మాట్లాడుతూ యాజమాన్యం కావాలనే కార్మికులకు వేతనాలు చెల్లించడంలో జాప్యం చేస్తుందని విమర్శించారు. కార్మికుల వేతనాలపై యాజమాన్య వైఖరిని స్టీల్‌మంత్రి ఎదుట అన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా తప్పుపడితే, ఆ వెంటనే సగం జీతం చెల్లించిందని, మిగిలిన సగం జీతం ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించారు. తక్షణమే బకాయి వేతనాన్ని చెల్లించకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్, పి శ్రీనివాసరాజు, బి అప్పారావు, గంగాధర్, టివికె రాజు, పుల్లారావు పాల్గొన్నారు.

బాలసదనం విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు



విద్యార్థినులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బాల సదనంలో ఉన్న 37మంది విద్యార్థినులకు శుక్రవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న కారణంగా జ్వరాలు, ఇతరత్రా అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశమున్నందు ముందు జాగ్రత్తగా స్థానిక యుపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కల్యాణచక్రవర్తి ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, విద్యార్థులకు ఆరోగ్యసూచనలు చేశారు. ప్రతి ఆరునెలలకోసారి ఇలావైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎఎన్ఎం కె పైడిరాజు, ఆశా వర్కర్ ఎ.ఈశ్వరమ్మ, జూనియర్ అసిస్టెంట్ ఎన్.నాగబాబు, బాల సదనం సూపరింటెండెంట్ కె ప్రమీల, ఆఫీస్ ఇన్‌ఛార్జి బి హేమలత, అకౌంటెంట్ జి నిర్మల పాల్గొన్నారు

టి.నగరపాలెంలోఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, టి నగరపాలెంలో విశాఖ మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలు విభాగాల వైద్య నిపుణులు పాల్గొని, సుమారు వంద మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. పంచాయితీ సర్పంచ్ పొట్నూరు ఛాయా గౌతమి, చంద్ర శేఖర్, పంచాయతీ వార్డు సభ్యులు పూసర్ల రామారావు పాల్గొన్నారు

44 మంది విద్యార్థినులకు మెరిట్ స్కాలర్‌షిప్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 44మంది విద్యార్థినులు 2023-24 విద్యా సంవత్సరానికి మెరిట్ స్కాలర్ షిప్‌కు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ బి మురళీకృష్ణ శుక్ర వారం తెలిపారు. ఎంపికైన ఒక్కో విద్యార్థినికి ఏడాదికి రూ.50 వేలు చొప్పున మూడేళ్లు ఇవ్వనున్నట్లు తెలిపారు.గతంలో 96 మంది విద్యార్థినులు మెరిట్ స్కాలర్‌షిప్ పొందారన్నారు. సిఎంఇ, ఇసిఇ, సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థినులు ప్రతిభ ఆధారంగా మెరిట్ స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు.

శ్రీనివాస్ చొరవతో సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి- వేపగుంట : స్థానిక శ్రీరామ్‌నగర్ ఐదు మదుములు వద్ద వర్షపునీటి ముంపు సమస్యకు జివిఎంసి శానిటేషన్ విభాగం అవుట్‌సోర్సింగ్ సూపర్‌వైజర్ దమ్ము శ్రీనివాసరావు చొరవ, సాహసంతో పరిష్కారం దొరికింది. వీడకుండా కురుస్తున్న వర్షంతో ఐదు మదుములు వద్ద ఉన్న పైపులు, అక్కడున్న కేబుల్స్, పైపులైన్లకు కొబ్బరి, అరటిచెట్లు, ఇతర చెత్తాచెదారం కొట్టుకువచ్చి అడ్డుకుపోవడంతో నీటిప్రవాహమంతా ఎగపోటు కట్టి, కల్వర్టు పైనుంచి ప్రవహించడంతో పాదచారులు, వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. దీంతో సమస్యను స్థానికులు ఎమ్మెల్యే గణబాబు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన జివిఎంసి అధికారులను అప్రమత్తం చేశారు. ఈలోగా సమాచారం అందుకున్న సూపర్‌వైజర్ శ్రీనివాస్ ధైర్యంగా, స్వయంగా తానే కాలువలో దిగి, మదుముల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చేశారు.

ముంచెత్తిన ముసురు!

- ఎడతెరిపి లేని వర్షంతో స్తంభించిన జనజీవనం
- రోడ్లుపైకి నీరు చేయడంతో రాకపోకలకు ఇక్కట్లు
- సాగునీటి వనరులకు జలకళతో రైతుల హర్షం



ఆనందపురంలో ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ

చెరువులు నిండడంతో రైతుల్లో ఆనందం

ప్రజాశక్తి -ఆనందపురం :మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గెడ్డలు పొంగిపొర్లుతూ, చెరువులకు జలకళ సంతరించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గుడిలోవ నీటిఛానల్ గెడ్డను ఆనుకుని ఉన్న కొత్తచెరువు, రాజుగారి చెరువు, మర్రిచెరువు, దొంతలవారి చెరువు, చింతవారిచెరువు, దండుచెరువు, పెద్దిపాలెం చెరువులోకి నీరు చేరింది. చెరువుల్లో నీరు చేరడంతో ఖరీఫ్‌కు లాభిస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా గెడ్డలు, చెరువుల్లో కొత్తనీరు చేరడంతో భారీగా చేపలు బయటపడ్డాయి. ఆనందపురం -బోని రోడ్డులో పొడుగుపాలెం ఎస్‌సి కాలనీ సమీపంలో కల్వర్టు వద్ద యువకులు వలలు వేయగా, పెద్దసైజులో చేపలు పడ్డాయి

బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం నుండి కురిసిన వర్షాలకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. గురువారం అర్ధరాత్రి నుండి ప్రారంభమైన వర్షం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల వరకు ఏకదాటన కురుస్తూనే ఉంది. దీంతో పలు గ్రామాల్లోని వీధులన్నీ జలమయం అయిపోయాయి. పంట పొలాల్లో నీరు చేరింది.

కోటవురట్ల: మండల వ్యాప్తంగా శుక్రవారం అల్ప పీడనం కారణంగా ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో, జనజీవనం స్తంభించడంతో పాటు, రైతులు సహా వివిధ వర్గాలకు చెందిన వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొ న్నారు. అల్ప పీడనం ప్రభావంతో పాఠశాలలకు సెలవు ప్రకటించారు మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం 4 గంటల వరకు 64 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసిల్దార్ వెంకటరమణ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేసినట్లు ఆయన తెలిపారు.

నక్కపల్లి :అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ముసురు వాతావరణం నెలకొంది. శుక్రవారం రోజంతా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో రోడ్లు తడిసి ముద్దయ్యాయి.రోజంతా వర్షం కురవడంతో పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. ఈ వర్షం వరి నారుకు ఊపిరి పోసినట్లు అయ్యింది. దీంతో, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ముసురు వాతావరణం నెల కొనడంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

విరిగిపడిన కొండచరియలు

గాజువాక: రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకుగాజువాక కొండవాలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. బిసి రోడ్డు సంజీవగిరి కాలనీలో భారీ కొండ రాయి రోడ్డు మీదకు దొర్లడంతో వాహన రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. సింహగిరి కాలనీలో కొండమీద ఇంటి పైకప్పు ఎగిరిపోయింది. రెవెన్యూ అధికారులు వివరాలు సేకరించారు.

వర్షాలకు దెబ్బతిన్న ఇల్లు

మధురవాడ :గురువారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జివిఎంసి ఐదో వార్డు స్వయంకృషి నగర్‌లో పలు ఇళ్లు దెబ్బతిన్నాయి. కొండవాలు ప్రాంతంలో ఎపుడు ఏం జరుగుతుందోనని నివాసితులు భయాందోళన చెందుతున్నారు. లోతట్టు ప్రాంతాలు, తీర ప్రాంతాల్లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పర్యటించి, అధికారులకు తగు సూచనలు చేశారు ఐదోవార్డులో వర్షంతో దెబ్బతిన్న ఇళ్లను కార్పొరేటర్ మొల్లి హేమలత పరిశీలించారు. కాగా కొండవాలులో రక్షణగోడ నిర్మించాలని కొన్నేళ్లుగా స్థానికులు కోరుతుండగా, అధికారులు, నేతలు పట్టించుకోకపోవడంతో వర్షాల సీజన్‌లో జనం భయంభయంగా కాలం గడపక తప్పడం లేదు.



మధురవాడలో కొండవాలులో విరిగిపడిన ఇంటిగోడలు

వెలవెలబోయిన పూలమార్కెట్

ఆనందపురం : ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వానతో స్థానిక పూలు, కూరగాయాల మార్కెట్‌లో వ్యాపారాలు స్తంభించిపోయాయి. సరైన సదుపాయాలు లేక రోడ్డుపైనే వర్షంలో తడుస్తూ రైతులు పువ్వులు, కాయగూరలు, పండ్లను అమ్ముకునే పరిస్థితి ఉంది. వాటిని సురక్షిత ప్రాంతంలో నిల్వ ఉంచే పరిస్థితిలేదు. మరోవైపు కొనుగోలుదారులు రాకపోవడంతోఅమ్మకాలు లేక రైతులు, వ్యాపారులు నష్టపోయే పరిస్థితి ఉంది. నిత్యం కళకళలాడే ఆనందపురం మార్కెట్ వర్షంతో వెలవెలబోయింది.

అందుబాటులో అప్రమత్తంగా ఉండాలి

పద్మనాభం: తుఫాన్ ప్రభావంతో వీడకుండా వర్షాలు కురుస్తుండడంతో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని. స్థానిక తహశీల్దార్ వెంకటరావు సూచించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మండల, గ్రామ స్థాయి అధికారులు తమకు నిర్దేశించిన ప్రాంతాల్లో అందుబాటులో ఉండాలని,, ఎప్పటికప్పుడు వర్షాలు, ముంపు ప్రభావిత సమస్యల సమాచారాన్ని మండలకేంద్రానికి, అలాగే జిల్లా కేంద్రానికి పంపుతుండాలన్నారు. తుఫాను సమాచారానికి ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు.

సర్వీసు రోడ్డులో నీరు చేరికతో చిక్కులు

తగరపువలస : రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సర్వీస్‌రోడ్డులో, అండర్‌పాస్‌కు ఇరువైపులా వర్షపునీరు ఉప్పొంగడంతో విశాఖ, తగరపువలస మార్గంలో వచ్చిపోయే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చప్టా ఎత్తుగా పునర్నిర్మించడంతో దీన్ని ఆనుకుని ఉన్న కొండప్ప చెరువు నీరు బయటకు పోయే అవకాశం లేకుండా పోయింది.కొండప్ప చెరువుకు ఆనుకుని ఉన్న అల్లూరి సీతారామరాజు కాలనీ వాసులు, ఇవతల సబ్బివాని వీధి ప్రాంత నివాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ఎమ్మెల్యే గంటా పరిశీలన

వర్షతీవ్రత, ముంపు ప్రభావం ఉన్న ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సంబంధిత అధికారులతో కలిసి శుక్ర వారం పరిశీలించారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యపై శాశ్వత చర్యలు ఎందుకు తీసుకోలేదని జోనల్ కమిషనర్ కె కనక మహాలక్ష్మి, జలవనరుల శాఖ డిఇఇ శ్రీచరణ్, ఇతర ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. తక్షణం తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.వార్డు కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, పలువురు మాజీ కౌన్సిలర్లు,టిడిపి నాయకులు పాల్గొన్నారు



ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే గంటా

అధ్వానస్థితిలో భెల్ రోడ్డు

నిధులున్నా పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం : అవస్థలు పడుతున్న ప్రజలు, కార్మికులు

ప్రజాశక్తి -గాజువాక : భెల్ రోడ్డు అధ్వానంగా ఉండడంతో, కార్మికులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి గ్రౌండ్ నుంచి తుంగ్లాం గేటు వరకు వెళ్లే ఈ రహదారిని ఏళ్లతరబడి మరమ్మతులు, అభివృద్ధి చేయకుండా భెల్ యాజమాన్యం నిర్లక్ష్యంగా వదిలేయడంతో నేడు రాకపోకలకు ఇబ్బందులు పడే పరిస్థిఇ ఏర్పడింది. ప్రతిరోజు మూడు షిఫ్టుల్లో పనిచేసే కార్మికులు ఎక్కువ శాతం ఈ రోడ్డు మీదుగానే కర్మాగారానికి చేరుకుంటారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో వీరు ప్రయాణించే వాహనాలు తరచూ మరమ్మతులకు గురికావడమే కాకుండా, ప్రయాణసమయంలో కుదుపులు వల్ల ఆరోగ్యపరంగా వెన్నునొప్పితో ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. తుంగ్లం గ్రామ ప్రజలు కూడా ఇదే రహదారిలో రాకపోకలు సాగించే పరిస్థితి ఉండడంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడ వివిధ అభివృద్ధి పనులకు రూ.మూడు కోట్ల నిధులు సిద్ధంగా ఉన్నా, వాటితో అవసరమైన అభివృద్ధిపనులు, సమస్యల పరిష్కార చర్యలు చేపట్టకుండా అలాగే ఖర్చు చేయకుండా ఉంచేస్తున్న తీరుపై ఆందోళన వ్యక్తమౌతోంది. ఇప్పటికైనా భెల్ యాజమాన్యం స్పందించి, అందుబాటులో ఉన్న నిధులతో ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



రాళ్లు తేలిన భెల్ రహదారి

21న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక నీడీ వెల్ఫేర్ అసోసియేషన్, యరబాల ఛారిటీ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బ్యాంక్‌కాలనీ సమీపంలోని కీటిన్‌పేట సన్ స్కూల్‌లో ఈ నెల 21న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శ్రీనివాస్, అనిల్‌ప్రసాద్ తెలిపారు. రక్తదాతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. దాతలు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు

బ్రెయిన్ స్ట్రోక్‌కు సరికొత్త చికిత్స



మాట్లాడుతున్న డాక్టర్ వీరవల్లి

ప్రజాశక్తి -మధురవాడ: రక్తం గడ్డకట్టడంతో రక్తనాళం మూసుకు పోవడం లేదా రక్తనాళం పగిలిపోవడం ద్వారా మెదడుకు రక్త సరఫరాలో అంతరాయం వల్ల ఏర్పడే బ్రెయిన్ స్ట్రోక్‌కు తమ పరిశోధనల ద్వారా సరికొత్త చికిత్సా పద్ధతులను గుర్తించినట్లు ఇల్లినాయస్ విశ్వవిద్యాలయం కేన్సర్ బయాలజీ, ఫార్మకాలజీ విభాగం న్యూరో సైన్స్ పరిశోధకుడు డాక్టర్ వీరవల్లి కృష్ణకుమార్ వెల్లడించారు.

శుక్రవారం గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, స్ట్రోక్‌లో ప్రధానంగా ఇస్కీమిక్, హెమరేజిక్. రెండు రకాలుంటాయని, రక్తం గడ్డకట్టి బ్రెయిన్‌కు సరఫరా ఆగిపోయినప్పుడు వచ్చే ఇస్కీమిక్ స్ట్రోక్‌ను ప్లాస్మినోజెన్ కణాల ప్రభావాన్ని అదుపు చేయడం ద్వారా నివారించవచ్చని తన అధ్యయనాల ద్వారా కనుగొన్నట్లు వెల్లడించారు కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్ దాస్, ప్రిన్సపాల్ డాక్టర్ ఎస్.రాజా, సీనియర్ ప్రొఫెసర్లు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వానంగా అనకాపల్లి-చోడవరం రోడ్డు

- పెద్ద పెద్ద గోతుల్లో చేరిన వర్షపు నీరు

- ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు



పెద్ద గోతులో వర్షపు నీరు చేరి అధ్వానంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రజలు, ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు పాలకులకు, అధికారులకు పట్టడం లేదనడానికి అనకాపల్లి జిల్లాలోని పలు రహదారులే నిదర్శనం. అనకాపల్లి-చోడవరం రోడ్డు ఎక్కడ చూసినా పెద్దపెద్ద గోతులమయంగా మారింది. ఈ మార్గంలో లెక్కకు మించిన భారీ క్వారీ క్రషర్స్ వాహనాలు పరిమితికి మించి లోడ్లతో వెళుతున్నా అధికారులు పట్టించుకోలేదు. దీంతో వేసిన రోడ్డు వేసినట్టే ఐదు ఆరు నెలల్లో శిథిల స్థితికి చేరుతున్నాయి. దీనికి తోడు రోడ్డు వేసేటప్పుడు కాలువలు నిర్మించకుండా వేయడంతో వర్షపు నీరు రోడ్లపైనే నిలిచిపోతుంది. శిథిల స్థితికి వెళ్ళిన రోడ్లను ప్రజాప్రతినిధులు అధికారులు చూస్తున్నారు తప్ప దీనికి పరిష్కార మార్గాన్ని చూపలేదు. దీంతో నిత్యం ఈ రోడ్లపై ప్రయాణిస్తున్న వాహనదారులు ప్రయాణికులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. తరచూ ప్రమాదాలకు గురై ఆసుపత్రి పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చెరువును తలపిస్తున్న అనకాపల్లి ఆర్టీసీ బస్టాండ్

నిత్యం వేలాదిమంది జిల్లా నలుమూలల నుంచి రాకపోకలు సాగిస్తున్న అనకాపల్లి ఆర్టీసీ బస్టాండ్ పరిస్థితి మరింత ఘోరంగా తయారైంది. ఏ పాటి చినుకుపడ్డా కాంప్లెక్స్ పూర్తిగా నీటితో మునిగిపోతుంది. అనకాపల్లిని అందాలపల్లిగా తీర్చిదిద్దుతామన్న పాలకులు అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. ప్లాట్ ఫారాల వరకు వర్షపు నీరు నిలిచిపోవడంతో బస్సులు ఎక్కేందుకు, దిగేందుకు కూడా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఆర్టీసీ కాంప్లెక్స్ ప్లాట్‌ఫారం వరకు నీరు నిల్వ ఉన్న దృశ్యం



పొలం వద్ద వర్షపు నీటిలో పసుపు పచ్చని కప్పలు

పసుపు పచ్చ కప్పలు ప్రత్యక్షం

ప్రజాశక్తి- రాంబిల్లి : శుక్రవారం ఒక్కసారిగా పెద్ద ఎత్తున వర్షం పడడంతో రాంబిల్లి మండలం, జెడ్ చింతువ పంచాయతీ, లోవ-పాలెం గ్రామంలో ఒక్కసారిగా వందల సంఖ్యలో పసుపు పచ్చ రంగు కప్పలు దర్శనమిచ్చాయి. కప్పలు బెక బెక అని అరుస్తూ పెద్ద చప్పుడు చేయడంతో చుట్టుపక్కల ప్రజలు పెద్ద సైజులో ఉన్న ఆ కప్పలను చూడ్డానికి ఎంతో ఉత్సాహంతో వచ్చారు. ఈ రకమైన కప్పలను ఎప్పుడూ చూడలేదని, ఈ కప్పులు వింత రకంగా ఉన్నాయని, ఇంత శబ్దం చేయడం కూడా ఎప్పుడు వినలేదని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

'నా భూములకు, నాకు రక్షణ కల్పించండి '

ప్రజాశక్తి-అచ్యుతాపురం : తమ సాగులో ఉన్న భూములకు, తనకు రక్షణ కల్పించాలని నునపర్తి గ్రామం సర్పంచ్ చుక్కా అనురాధ విజ్ఞప్తి చేశారు. అచ్చుతాపురంలో శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ నునపర్తి గ్రామంలో తనపై కొంతమంది వ్యక్తులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని తెలిపారు. 1977వ సంవత్సరంలో గ్రామానికి చెందిన సర్వే నెంబరు 1బి 5సిలో రెండు ఎకరాల 25 సెంట్లు భూమికి అప్పటి అధికారులు చుక్క సన్యాసమ్మ పేరున బి పట్టా నమోదు చేశారని తెలిపారు. అనంతరం పట్టాదారు పాసుపుస్తకం రెవెన్యూ అధికారులు ఇచ్చారన్నారు. ఆన్లైన్లోనూ రీ సర్వే సందర్భంగానూ సదర సర్వేనెంబర్ గల భూమికి తమ పేర్లతో నమో చేశారని ఆమె తెలిపారు. అప్పటినుంచి మా సాగులో ఉన్న భూమిని దున్నుతుండగా గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తుల ప్రోద్భలంతో అడ్డగించుతున్నారని పేర్కొన్నారు. తన ఇంటి పైకి వచ్చి గొడవకు దిగుతున్నారని, తనకు తమ సాగులోనున్న భూమికి రక్షణ కల్పించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు ద్వారపురెడ్డి బాబ్జి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నునపర్తి సర్పంచ్ అనురాధ

రోడ్లపైకి పొంగిన మురుగునీరు

ప్రజాశక్తి- కె.కోటపాడు : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రం కె.కోటపాడులో డ్రెయినేజీల నుండి మురుగునీరు రోడ్లపై పొంగి ప్రవహించింది. కోటపాడులో మురికి కాలువలు సరిగా లేనిచోట్ల మురుగునీరు పొంగి వీధుల్లోకి రోడ్లమీదకి వర్షపు నీటికి కలిపి ప్రవహిస్తుంది. దీంతో ఆయా కాలనీలో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కోటపాడు దిగువ యాతపేటలో సింగంపల్లి సూరి నాయుడు ధాన్యం మిల్లు వద్ద కాలువపై చిన్న గొట్టాలు వేయడంతో నీరు వెళ్లే మార్గం లేక రోడ్లపైనే వీధుల్లోనూ మురుగునీరు ప్రవహిస్తుంది. ఇప్పటికైనా అధికారులు ఆ పైపులు తీసివేసి మధుం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రధాన రోడ్డుపైకి వచ్చిన మురుగునీరు

ఏకధాటి వర్షంతో కూలి పనులకు ఆటంకం

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలంలో గురు, శుక్రవారాల్లో ఏకధాటిగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కూలి పనులకు ఆటంకం ఏర్పడింది. కూలీలు ఇంటికే పరిమితమయ్యారు. మండలంలోని జమ్మాదులపాలెం పరవాడపాలెం, సింగవరం, అచ్చర్ల, సోమవరం, నర్సింగబిల్లి గ్రామల నుండి అనకాపల్లి, గాజవాక పట్టణ ప్రాంతలకు కూలి పనులకు ప్రతి రోజూ వెళ్తు ఉంటారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో అయా గ్రామాలకు చెందిన కూలీలు ఇళ్లకే పరిమితమయ్యారు. వర్షాలు కురవడంతో సరుగుడు, నీలగిరి మొక్కలు నాటే పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు.

పంటను నేరుగా అమ్ముకుంటే రైతుకు మేలు

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ విసయకృష్ణన్ తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

రైతులు పండించే తమ పంటను డైరెక్టుగా అమ్ముకునే విధానం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన రైతు ఉత్పత్తిదారుల సంఘాలు డిస్ట్రిక్ట్ లెవెల్ మోనటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో గల వివిధ రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులతో, రైతులు పండించే పంటలు, వాటి మార్కెటింగ్ అవకాశాలతో పాటు రైతు పండించిన పంటను స్టోరేజ్ చేసే అవకాశాలు గురించి చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు అధిక లాభాలు వచ్చే విధంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దళారీ వ్యవస్థ ద్వారా రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు అవసరమైన అనుమతులు, సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో నాబార్డ్, హార్టికల్చర్, అగ్రికల్చర్, డిఆర్డిఎ, ఫిషరీస్ శాఖల అధికారులు, ఎల్‌డిఎమ్, వివిధ రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



గొడుగులు వేసుకొని నిరసన కొనసాగిస్తున్న సిబ్బంది

వర్షంలోనూ కొనసాగిన రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా వైద్యాలయంలో మత్తు వ్యసన విముక్తి కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి 12 నెలలుగా జీతాలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ కొన్ని రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న సిబ్బంది.., శుక్రవారం జోరు వానలోనూ తమ ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగంలో ఎంతో ప్రాధాన్యత గల మత్తు వ్యసన విముక్తి కేంద్రాలలో పనిచేస్తున్న సిబ్బందికి కనీసం ప్రతీ నెలా జీతాలు కూడా ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే సమస్యలపై జిల్లా కలెక్టర్, డిఎంహెచ్వో, డిసిహెచ్ఎస్ తదితరులకు వినతి పత్రాలు అందించడం జరిగిందన్నారు. ఇప్పటికైనా తమ ఆర్థిక ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ చంద్ర, ఎస్.క్రాంతి కుమార్, బి.నాయుడుబాబు, రాజ్యలక్ష్మి, శ్రీదేవి, ఎ.మణి పాల్గొన్నారు.

23 నుండి మొబైల్ ఆధార్ కేంద్రాలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని ఈ నెల 23 నుండి మొబైల్ ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో పట్నాయక్ తెలిపారు. పింద్రంగి, వి.సంతపాలెం గ్రామాల్లో ఈనెల 23న, తొలి విడతలో ప్రారంభమవుతాయని అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 24, కొరువాడ, వారాడ సచివాలయాల్లోనూ, 25న గవరపాలెం ఆర్వై అగ్రహారం, 26న ఎ.కోడూరు, సూదివలస, 27న సింగన్నదొర పాలెం, మర్రివలస గ్రామాల్లోనూ ఈ మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాలు పనిచేస్తాయని తెలిపారు. ప్రజలు కొత్త ఆధార్ కార్డులు పొందనివారు పొందవచ్చని, తప్పులను సరి చేసుకోవచ్చని, ఆధార్ ఫోన్ నెంబర్ లింకు చేసుకోవచ్చని పట్నాయక్ తెలిపారు.

జనసేన సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని మల్లునాయుడు పాలెం, గుళ్లేపల్లి, ఎల్లుప్పి, బోదువలస గ్రామాల్లో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సోదరులు పంచకర్ల వెంకటేశ్వరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ నాలుగో విడత క్రియాశీలక సభ్యత్వం నమోదు కార్యక్రమంలో భాగంగా పెందుర్తి నియోజకవర్గంలో జనసేన సభ్యత్వాలు శరవేగంగా నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు కర్రి కనకరాజు, నాయకులు బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకటరమణ, సాలాపు వెంకటేశ్వరరావు, బంతికోళ్ల పద్మ, సబ్బవరపు రవి, కంచిపాటి రాంబాబు, కోదండ, గణేష్, వెంకీ మంగరాజు, పూర్ణ, సాయి కార్యకర్తలు పాల్గొన్నారు.

పెరిగిన రైవాడ రిజర్వాయర్ నీటి మట్టం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని రైవాడ జలాశయం నీటిమట్టం పెరుగుతుంది. గరిష్ట నీటిమట్టం 114.00 మీటర్లు కాగా గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 3.60 టీఎంసీలు ఉన్నట్లు జలాశయం డిఈఈ ఆర్.సత్యం నాయుడు తెలిపారు. ప్రస్తుత నీటిమట్టం 106.30 మీటర్లు వద్ద నమోదైంది. ప్రస్తుతం జలాశయంలోకి 500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. రైతులు కోరిన వెంటనే సాగునీరు విడుదల చేయటం జరుగుతుందని డిఈఈ సత్యం నాయుడు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా గురువారం 6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, శుక్రవారం 35 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని తెలిపారు.



రైవాడ రిజర్వాయర్‌లో చేరిన నీరు


మొక్కలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మొక్కల పంపిణీ

ప్రజాశక్తి-చోడవరం : యోగా సంకల్పం వంద రోజులు పూర్తయిన సందర్భంగా స్థానిక వికాస్ ఆఫీస్‌లో శుక్రవారం పర్యావరణలో భాగంగా మొక్కల పంపిణీ చేశారు. దీనికి ముందు ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థలో ఉన్న సభ్యులందరూ సుమారు రెండు గంటల పాటు యోగాసనాలు వేశారు. యోగా గురువు అరెపు శ్రీనివాసరావు మాట్లాడుతూ యోగా శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన నాటి నుండి పట్టణానికి చెందిన అనేక మంది స్త్రీ పురుషులు యోగాను అభ్యసించినట్లు చెప్పారు. వంద రోజులు పాటు ఎన్విరామెంగా శిక్షణ కొనసాగించిన తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త చారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పప్పల రమణమూర్తి, శ్రీను, అడపా భులక్ష్మి, డి. రాజా, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

బొజ్జన్న కొండ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి బొజ్జన్న కొండ అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేయాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు బల్ల నాగభూషణం శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. బొజ్జన్న కొండను అభివృద్ధి చేయాలని తమ సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో నిరసనలు, వినతి పత్రాల ద్వారా కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలకు, అధికారులకు విజ్ఞప్తి చేసిన మేరకు మాజీ ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి కృషి ఫలితంగా రూ.15 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. అభివృద్ధి పనులు ప్రారంభించి రెండేళ్ళు కావస్తున్నా నేటికీ పూర్తికాలేదని పేర్కొన్నారు. బొజ్జన్న కొండ అభివృద్ధి పనులు పూర్తి చేసి పర్యాటకులు, బౌద్ధ భిక్షువులు, దేశ, విదేశీ సందర్శకుల ఆకాంక్షలను నెరవేర్చాలని కలెక్టర్ విజయకృష్ణన్‌కు, పురావస్తు పరిశోధనల శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి బార్ అసోసియేషన్, మండల లీగల్ సర్వీస్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెడికల్ క్యాంప్‌కు విశేష స్పందన లభించింది. వేద్ నేత్రాలయా సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ సహకారంతో కోర్టు న్యాయవాదుల హాల్లో కళ్ళకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. జిల్లా జడ్జి శ్రీవిద్య శిబిరాన్ని ప్రారంభించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది అధిక సంఖ్యలో పరీక్షలు చేయించుకున్నారు. న్యాయమూర్తులు రమేష్, విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంజెవిఎస్ కుమార్, సెక్రెటరీ దుర్గారావు, ఉపాధ్యక్షులు రోజా, జాయింట్ సెక్రటరీ తులసి తదితరులు పాల్గొన్నారు. డాక్టర్లు పంకజ్ డోంగ్రే, జి. వేణుగోపాల్ పరీక్షలు నిర్వహించారు.

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఇన్నోవేషన్ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి - పరవాడ : మండల కేంద్రం పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్టిపిసి సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, ఇన్నోవేషన్ ల్యాబ్‌ను శుక్రవారం పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్‌బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్టిపిసి చీఫ్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా, ఎన్టిపిసి యాజమాన్యం, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ కాలేజ్ ఇబ్బంది, పరవాడ గ్రామ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పశుగ్రాసం విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి - కె.కోటపాడు : రైతులకు రాయితీపై అందించే పశుగ్రాసం విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. 280 కిలోల కాకిజొన్న, 735 కిలోల మొక్కజొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఐదు కిలోల కాకి జొన్న రాయితీ పోను 115 రూపాయలు, మొక్కజొన్న రాయితీ పోను ఐదు కేజీలు 85 రూపాయలకు అందిస్తున్నట్లు తెలిపారు. పశువులకు ఈ గ్రాసం ఎంతో బలవర్ధకమైన ఆహారమని తెలిపారు. రైతులు ఆయా గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలి

మండల సమావేశంలో ఎమ్మెల్యే పంచకర్ల

ప్రజాశక్తి-పరవాడ

అధికారులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పైల వెంకట పద్మ లక్ష్మీ అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్తు సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును ఎంపిపి వెంకటపద్మలక్ష్మి, జడ్పిటిసి పైల సన్యాసిరాజుతో పాటు ఉమ్మడి జిల్లా పంచాయతీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు చింతకాయల సూజాత ముత్యాలు తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి సాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, పంచాయతీ రాజ్, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, నీటిపారుదల, గృహ నిర్మాణ తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో ప్రజలు ఇబ్బంది పడకుండా రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యలను వేగవంతం చేసేందుకు ప్రతిపాదనలు, అంచనాలు తయారు చేయాలని కోరారు. అధికారులు బాధ్యతగా పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులకు ఏ సమస్యలున్నా ఎంపీడీఓ, ఎంపిపి దృష్టికి తీసుకురావాలని, తక్షణమే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కీర్తి స్పందన, తహశీల్దారు గణపతి రావు, వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూసి అప్పలరాజు, పరవాడ, రావాడ, పి.బోనంగి, ఇ.బోనంగి, వెన్నెలపాలెం సర్పంచ్‌లు సిరిపరపు అప్పలనాయుడు, మోటూరు సన్యాసినాయుడు, బండారు కల్పనా రాజశేఖర్, బొద్దపు శ్రీనివాసరావు కాసులు, వెన్నెల అప్పారావు, మండలంలోని పలువురు సర్పంచ్లు, ఎంపీటీసీలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

ఇఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని వినతి

పరవాడ : పరవాడ మండల కేంద్రంలో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని శుక్రవారం పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబుకి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యానారాయణ వినతిపత్రం అందజేశారు. పరవాడ మండలంలో ఎన్‌టిపిసి, ఫార్మాసిటీ, ఇండస్ట్రియల్ పార్కుల్లో సుమారు 40 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి ఈఎస్ఐ ఆసుపత్రి అవసరం ఉందని తెలిపారు. గతంలో పరవాడలో ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేసి ఒక్కసారి కూడా తెరవలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా నూతన రాష్ట్ర ప్రభుత్వం ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేసి కార్మికులకి వైద్య సేవలు అందించాలని గనిశెట్టి కోరారు.

రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని...

మండలంలోని వెన్నెల పాలెం నుండి ఎన్టిపిసి వెళ్లే ప్రధాన రోడ్డు వరకు రోడ్డు పాడైపోయి గోతులు ఏర్పడ్డాయని, ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టి, జంగిల్ క్లియరెన్స్ చేయాలని శుక్రవారం వెన్నెల పాలెం ఉపసర్పంచి వెన్నెల సన్యాసిరావు పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు.



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

టిడిపిలో చేరిన వైసిపి నాయకులు


టిడిపిలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బండారు తదితరులు

ప్రజాశక్తి - కె.కోటపాడు

మండలంలోని గొండుపాలెం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ సర్పంచ్, మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు వంటాకు శ్రీను, చోడవరం సుగర్ ఫ్యాక్టరీ పాలకవర్గం మాజీ డైరెక్టర్ దొగ్గ ఉమాశంకర్ ఆధ్వర్యాన పలువురు శుక్రవారం టిడిపి మండల అధ్యక్షుడు రొంగలి మహేష్ ఆధ్వర్యంలో అనకాపల్లి టీడీపీ కార్యాలయంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి సమక్షంలో టీడీపీలో చేరారు. వారిని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు తదితరులు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో గొండుపాలెం పాల సంఘం డైరెక్టర్లు బండారు సూర్యనారాయణ, వంటాకు దేముడుబాబు, సాగునీటి సంఘం మాజీ డైరెక్టరు బండారు రామన్నపాత్రుడు, మాజీ ఉపసర్పంచ్ ఆడారి ఈశ్వరరావు, సీనియర్ నాయకుడు మద్దాల ఈశ్వరరావు తదితరులు ఉన్నారు. వంటాకు శ్రీను, దొగ్గ ఉమాశంకర్ టీడీపీలో చేరడంపట్ల గొండుపాలెం టీడీపీ అధ్యక్షుడు ఈర్లి దేముడుబాబు, చౌడువాడ, ఎ.కోడూరు సర్పంచ్‌లు దాడి ఎరుకునాయుడు, బొడ్డు అక్కునాయుడు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

వాతావరణ ఆధారిత వ్యవసాయ సూచనలు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లా రైతాంగానికి వాతావరణ ఆధారిత వ్యవసాయ సూచనలను స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. వరి నారుమడిలో అగ్గి తెగులు, గోధుమ రంగు మచ్చ తెగులు ఆశిస్తే కార్బండిజం ఒక గ్రాము లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. పొడ తెగులు ఆశిస్తే హెక్సాకొనజోల్ రెండు మిల్లీ లీటర్లు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. కలుపు సమస్య తలెత్తితే పైరజో సల్ఫ్యూరాన్ ఇథైల్ మందును ఎకరాకు 80 నుంచి 100 గ్రాములు చొప్పున 20 నుంచి 25 కిలోల ఇసుకలో కలిపి విత్తిన నాలుగు నుంచి ఏడు రోజుల్లో వేసుకోవాలి. నారుమడి విత్తిన పది రోజులకు సెంటుకు 150 గ్రాములు చొప్పున కార్బోఫ్యూరాన్ గుళికలు వేసుకోవాలి. చెరకులో ముచ్చుకుల్లు తెగులు ఆశిస్తే కార్బండిజం ఒక గ్రాము లేదా మాంకోజెబ్ మూడు గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి ఉధృతను బట్టి 10 నుంచి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. వర్షాధార చెరకు నాటిన 25 నుంచి 30 రోజులకు కలుపు నివారణ కోసం మెట్రిబుజిన్ 400 గ్రాములు, 2,4 డి సోడియం సాల్టు 800 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. పేను బంక పురుగు ఆశిస్తే డైమిథోయేట్ రెండు మిల్లీ లీటర్లు లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి. పీక పురుగు ఆశిస్తే మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్లు లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 0.3 మిల్లీ లీటర్లు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. ట్రైకో గ్రామఖిలోనిస్ గుడ్ల పరాన్న జీవిని ఎకరాకు 20వేల గుడ్లు చొప్పున చెరకు నాటిన 30 రోజుల నుంచి ఏడు నుంచి పది రోజుల వ్యవధిలో నాలుగు నుంచి ఆరుసార్లు విడుదల చేయాలని సూచించారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక ఎంఈఓ కార్యాలయ సమీపంలో ఒరిగిన విద్యుత్ స్తంభం భయాందోళనలకు గురి చేస్తోంది. విద్యుత్ స్తంభం సమీపంలో రైతుల భూములు, పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉండడంతో రోజూ వందలాది మంది ఆ మార్గం గుండా ప్రయాణాలు చేస్తారు. విద్యుత్ సరఫరా జరుగుతున్న స్తంభం కురుస్తున్న వర్షాలకు కూలిపోయే పరిస్థితి ఉంది. అదే జరిగితే పెను ప్రమాదం సంభవిస్తుంది. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు చొరవ తీసుకొని ఒరిగిన స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభం వేయాలని పలువురు ఉద్యోగులు, రైతులు కోరుతున్నారు.


ఒరిగిపోయి ఉన్న విద్యుత్ స్తంభం


మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ఎంపిడిఒ అప్పలరాజు

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి: తుఫాన్ కారణంగా గ్రామపంచాయతీలో వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ చర్యలు తీసుకోవాలని ఇన్చార్జి ఎంపీడీవో ఎస్ అప్పలరాజు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని డ్రైనేజీల్లో ఎక్కడ మురుగునీరు నిల్వ ఉండకుండా పోయేలాగా చూడాలని, తరచూ బ్లీచింగ్, క్లోరినేషన్ చేస్తూ తుఫాను ముగిసే వరకు సిబ్బంది అందరూ సచివాలయం పరిధిలోనే అందుబాటులో ఉండేటట్లుగా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సూచించారు. ఈ సమావేశంలో ఇంచార్జి ఈఓపీఆర్డీ ఎస్.సంతోష్ నళిని, ఆర్‌డబ్ల్యూఎస్ చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగులకు వీల్‌చైర్లు పంపిణీ

ప్రజాశక్తి-సబ్బవరం : వికలాంగులకు విశాఖపట్నం దసపల్లా హోటల్లో వీల్ చైర్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా వికలాంగులు వీల్ చైర్లు కావాలనుకుంటే, ముందుగా 9885029064 నెంబర్‌కి ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-వడ్డాది : ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజేశ్వరి అన్నారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాది సెక్టర్ పరిధి విజయ రామరాజుపేట అంగన్వాడీ కేంద్రంలో లబ్దిదారులకు, గ్రామీణ మహిళలకు 'మిషన్ శక్తి'లో భాగంగా భారతీయ న్యాయ సంహిత చట్టాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ స్త్రీలు, పిల్లలపై జరుగుతున్న నేరాలు, వాటికి సంబంధించిన శిక్షలు గూర్చి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అంగన్వాడీ లబ్దిదారులైన గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, విశ్రాంతి కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ భార్గవి, వైద్య సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది కుసుమ కుమారి పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సూపర్ వైజర్ రాజేశ్వరి

వరదలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-నక్కపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడన ప్రభావంతో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తుఫాన్ ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉండాలని డి ఎల్‌పిఓ ఎస్ఎస్ ఎన్ మూర్తి సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. తుఫాను ముందు, తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని తెలిపారు. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. భారీ వర్షాలు కురిసినట్లయితే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తుగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సీతారామరాజు, ఈఓపిఆర్‌డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు .

కోటవురట్ల: అధికారులు అప్రమత్తంగా ఉండాని జిల్లా కలెక్టర్ శుక్రవారం తసిల్దార్ కార్యాలయంలో వీడియో కాన్ఫిరెన్స్‌లో అధికారులకు సూచించారు. లోతట్టు ప్రాంతాలు పరిశీలించడంతోపాటు రహదారి, పారిశుధ్య సమస్యలతో పాటు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు పాల్గొన్నారు.



బుచ్చయ్యపేటలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

నాతవరం: మండలం కేంద్రంలో తుఫాను ప్రభావం దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని నాతవరం ఎంపీడీవో జె.రాంబాబు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో తహసిల్దార్ ఎన్.రమేష్ కుమార్‌తో కలిసి పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల, గ్రామస్థాయి అధికారులు వర్షాలు తగ్గే వరకు హెడ్‌క్వార్టర్స్‌లో ఉండాలని ఆదేశించారు. గ్రామాల్లో వర్షాలతో ఎటువంటి నష్టం జరిగినా వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. పంచాయతీలలో ప్రజలకు తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలని సూచించారు.

చీడికాడ: తుఫాన్ కారణంగా గ్రామస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు సమాచారాన్ని మండల స్థాయి అధికారులకు చేరవేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరి సూచించారు. చీడికాడ మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మండల, గ్రామస్థాయి అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామస్థాయి అధికారులు గ్రామాలలో అందుబాటులో ఉండి, సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట: భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా వుండే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వెంకటాచార్య తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారీ వర్షాల కారణంగా పిడుగులు పడే అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రజలు చెట్ల కింద ఉండకుండానూ, చిన్నపిల్లల్ని బయటకు పంపించకుండా చూసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిఎం బాలరాజు , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సూచనలు ఇస్తున్న తహశీల్దార్

కల్యాణపులోవను పరిశీలించిన తహశీల్దార్

ప్రజాశక్తి- కొత్తకోట: కల్యాణపులోవ జలాశయం వద్ద ఇరిగేషన్ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రావికమతం తహసీల్దార్ రమణారావు ఆదేశించారు. అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జలాశయంను శుక్రవారం తహసిల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా జలాశయం ఏఈ సత్యనారాయణదొరను ప్రస్తుతం జలాశయంలోని నీటి పరిస్థితి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జలాశయం గరిష్ట నీటిమట్టం 460 అడుగులు కాగా ప్రస్తుతం 458.8 0 అడుగుల వద్దకు నీటిమట్టం చేరుకుందన్నారు. ఇన్ ఫ్లో 100 క్యూసెక్కులు ఉందని ఏఈ వివరించారు. వర్ష తీవ్రత ఎక్కువైన పక్షంలో నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరుకునే అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు నీటి మట్టాన్ని సమీక్షించాలని సూచించారు. ప్రమాద స్థాయికి చేరుకున్న ఎడల జలాశయం గేట్లు ఎత్తి నదిలోకి నీరు విడుదల చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సర్పానదిలోకి నీరు విడుదల

ప్రజాశక్తి-కొత్తకోట: రావికమతం మండలంలో చీమలపాడు పంచాయతీ కళ్యాణపులోవ జలాశయం నుంచి శుక్రవారం సాయంత్రం 100 క్యూసెక్కుల నీటిని సర్పా నదిలోకి విడుదల చేశామని జలాశయం ఏఈ సత్యనారాయణ దొర చెప్పారు. జలాశయం గరిష్ట నీటిమట్టం 460 అడుగులు కాగా సాయంత్రానికి 459 చేరుకుంది. జలాశయం పరి వాహక పరిధిలో 12 మీ.మీ వర్షపాతం నమోదు కావడం జలాశయంలోకి 100 క్యూసెక్కుల నీరు నిరంతరంగా చేరుతుందని వివరించారు. ఈ నీటి మట్టాన్ని స్థిరీకరించినందుకు జలాశయం రెండు గేట్లు ఎత్తి 100 క్యూసెక్కుల నీటిని సర్పా నది లోకి విడుదల చేశామని ఏఈ తెలిపారు. నది పరివాహక ప్రాంతాల ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు..



విడుదల చేస్తున్న నీరు



కొండను ఎక్కుతున్న టిడిపి నేత, పక్కన హోం మంత్రి

అనిత గెలుపుతో మోకాళ్లపై కొండకు..

ప్రజాశక్తి-నక్కపల్లి: పాయకరావుపేట నియోజకవర్గంలో వంగలపూడి అనిత ఎమ్మెల్యేగా గెలుపొందితే తిరుమలలో మెట్ల మార్గంలో కాలినడకన మోకాళ్ళ పర్వతం మెట్లు మోకాళ్లపై వెళ్లానని శుక్రవారం నక్కపల్లి టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ తెలిపారు. పాయకరావుపేట నియోజక వర్గంలో మునుపెన్నడూ లేని విధంగా అత్యధిక మెజారిటీతో ఎమ్మెల్యేగా అనిత గెలుపొందారని ఆనందం వ్యక్తం చేసారు. హోంమంత్రి వంగలపూడి అనిత కూడా పార్టీకి చెందిన పలువురు నాయకులతో కలిసి తిరుమల వెంకన్నను దర్శించుకున్నారు. ఆమె వెంట టిడిపి మండల శాఖ అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, జానకి శ్రీను, అమలకంటి అబద్దం , నాయకులు కురుందాసు నూకరాజు, కొప్పిశెట్టి బుజ్జి,గింజాల లక్ష్మణరావు, ఎన్.వెంకటరాజు, గుర్రం రామకృష్ణ, గోసల శ్రీకాంత్ ఉన్నారు.

కత్తితో వ్యక్తి వీరంగం

ప్రజాశక్తి-రోలుగుంట: మండల కేంద్రంలో భూ వివాదంలో ఓ వ్యక్తి కత్తితో వీరంగం చేశాడు. స్థానికుల కథనం మేరకు...గ్రామానికి చెందిన సుర్ల శ్రీను భూ వివాదంలో తన మేనమామ చింతకాయల నారాయణమూర్తిపై కత్తితో శుక్రవారం హల్‌చల్ చేశాడు. చింతకాయల నారాయణమూర్తికి తన అక్క జీలుగ రాజులమ్మ భర్త ద్వారా వచ్చిన స్థిరాస్తిలకు 1999లో వీలునామా రాసింది. నగరంకు చెందిన రాజులమ్మ ఆమెకు సంక్రమించిన భూమిని కొంత అమ్మి ఆ సొమ్ముతో అమ్మగారి ఊరిలో 0.66 సెంట్ల భూమిని కొనుగోలు చేసి నారాయణమూర్తి పేరున రిజిస్ట్రేషన్ చేసింది. డాక్యుమెంట్లు, పట్టాదారు పాసు పుస్తకం, 1బి నారాయణమూర్తి పేరున రిజిస్ట్రేషన్ చేసింది. నారాయణమూర్తి మేనల్లుడు సుర్ల శ్రీనుకు కూడా మరణించిన రాజులమ్మ వీలునామా రాసింది. ఆ భూమిలో తనకు వాటా ఉందని గత 10 సంవత్సరాలుగా ఇరువర్గాల వారు ఘర్షణ పడుతున్నారు. ఆధారాలు నారాయణమూర్తికి ఉండటంతో కోర్టు కూడా ఈయనకు అనుకూలంగా తీర్పు నిచ్చింది. ఈ విషయంపై నారాయణ మూర్తి రోలుగుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను ఎనిమిది సంవత్సరాల క్రితం సరుగుడు తోట వేశానని, ఆ పంట తీయుటకు సహాయ సహకారాలు అందించాలని ఫిర్యాదులో కోరాడు. ఈ విషయంపై శుక్రవారం ఆర్ఐ, వీఆర్వోలు విచారణకై భూమి వద్దకు వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న సుర్ల శ్రీను రెవెన్యూ అధికారులపై విరుచుకుపడటమే కాకుండా కత్తితో వీరంగం చేశాడు.



కత్తితో సంచరిస్తున్న వ్యక్తి



అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి

పశువుల వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి- చింతపల్లి: గిరిజనులు పశువుల వ్యాధులపై పై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని లంబసింగి పశు వైద్యాధికారి సిహెచ్.చాలిని సూచించారు. పెద్ద బరడ గ్రామంలో ఓ పశువు క్రిమి సంహారక మందు పిచికారి చేసిన గడ్డిని ఆహారంగా తీసుకోవడంతో ఇటీవల మరణించింది. ఈ మేరకు శుక్రవారం మండలంలోని పెద్ద బరడ గ్రామపంచాయతీ కేంద్రంలో పశువుల్లో కలిగే వ్యాధులపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి మాట్లాడుతూ, పశువుల్లో వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పశు వైద్యశాలకు సమాచారం ఇస్తే గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. మందులు పిచికారి చేసిన పొలాల వైపు పశువులను మేతకు తీసుకెళ్లరాదని సూచించారు.



జెసిబితో చేపడుతున్న మరమ్మతు పనులు

కొర్రాయి వంతెన వద్ద మరమ్మతు పనులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఇటీవల కురుస్తున్న వర్షాలతో మండలంలోని కొర్రాయి వంతెనపైన గెడ్డ నీరు పొంగి ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక ఆ పంచాయతీ సర్పంచ్ పి.కొములు సందర్శించి పరిశీలించారు. వెంటనే స్థానికుల సహాయంతో వంతెన వద్ద గొట్టాలను అమర్చి వాహన రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు తాత్కాలిక మరమ్మత్తు పనులు చేపట్టారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ, గత మూడు ఏళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణ పనులను ప్రారంభించిందన్నారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించక పోవడంతో పనులు మతధ్యలో నిలిచి పోయాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న వంతెనను పూర్తిగా నిర్మించాలని ఆయన కోరారు.

కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-కొత్తకోట: రావికమతం మండలంలో గొడగలి కులస్థులు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని తహసిల్దార్ రమణారావు తెలిపారు. ఎస్సీ సబ్ కులానికి చెందిన గోడగలి కులస్తులు కుల ధ్రువీకరణ కోసం ఆన్లైన్లో దరఖాస్తు ఆప్షన్ లేక పోవడంపై ఈనెల 12న మండలంలో కొత్తకోటకు చెందిన ఈ కులస్థులు తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ కోసం సచివాలయానికి వారు వెళ్ళగా ఈ కులానికి సంబంధించిన ఆప్షన్ ఆన్లైన్లో లేదని దరఖాస్తు సిబ్బంది తెలిపారు. దీంతో తహసిల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టిన మేరకు ఆర్డీవోకు వివరించారు. ఈ మేరకు 19వ తేదీ నుంచి సచివాలయాల్లో గొడగలి కులస్తులు దరఖాస్తుకు చేసుకునేందుకు ఆప్షన్ ఇచ్చారని తహసిల్దార్ కోరారు.

సభ్యత్వ నమోదుపై చర్చ

ప్రజాశక్తి-నక్కపల్లి: జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు నమోదు చేసుకోవాలని ఆ పార్టీ నాయకులు బోడపాటి శివ దత్, తోట నగేష్ అన్నారు. నక్కపల్లి పార్టీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ సభ్యత్వాల నమోదుపై చర్చించారు. పార్టీ క్రియాశీలక సభ్యులకు ఏ పార్టీలోని లేని విధంగా రూ.5 లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న దాత

ఆలయాలకు రూ.1.80 లక్షల విరాళం

ప్రజాశక్తి-మాడుగుల:మాడుగులలో దేవాలయాల అభివృద్ధికి బెంగళూరులో నివాసముంటున్న మాడుగులకు చెందిన కుటుంబం రూ.1.80 లక్షలు విరాళంగా అందించారు. మాడుగులలో నివాసం ఉండే చెక్క శ్రీరామ్మూర్తి కుమారుడు చెక్క వెంకటేష్ తన కుటుంబంతో బెంగళూరులో స్థిరపడ్డారు. వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయానికి రూ.1.26 లక్షలు, మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి రూ.27 వేలు, షిరిడి సాయి బాబా ఆలయానికి రూ.27 వేలు మొత్తంగా రూ.1,80,000 విరాళాన్ని శుక్రవారం ఆలయ నిర్వాహకులకు అందించారు. శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ అధ్యక్షులు కేవీపీ. ఆంజనేయులు, ఆలయ కార్యదర్శి కొప్పాక వెంకట రాజేశ్వరరావు, కోశాధికారి కొప్పాక హరిబాబు, మోదకొండమ్మ ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజుకు శ్రీరామ్మూర్తి కుమారుడు చెక్కా వెంకటేష్ విరాళం చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కోయంబత్తూరు - దానాపూర్ మధ్య ప్రత్యేక రైలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కోయంబత్తూర్ నుండి దానాపూర్ వరకు వన్ వే ప్రత్యేక రైలును నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో 06185 కోయంబత్తూరు - దానాపూర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ జూలై 21 ఆదివారం రాత్రి 23:30 గంటలకు కోయంబత్తూరులో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 20:10 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది మరల 20:15 గంటలకు బయలుదేరి మంగళవారం అర్ధరాత్రి 01:30 గంటలకు దానాపూర్ చేరుకుంటుంది. ఈ రైలు ఆంధ్రప్రదేశ్ లోని గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, దువ్వాడ, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం మీదుగా ప్రయాణిస్తుంది.

హానర్ 200 సిరీస్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:ఎఐతో కూడిన స్టూడియో, పోర్ట్రెయిట్ ఫోటోగ్రఫీతో మొబైల్ ఇమేజింగ్ హానర్ 200 సిరీస్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం నగరంలోని ఒక హోటల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌టెక్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సిపి ఖండేల్వాల్ మాట్లాడుతూ, ఇది నెక్స్ట్ లెవల్ ఆఫ్‌లో చాలా గొప్పది అన్నారు. హానర్ 200,ప్రో 5జి, హానర్ 200 5జి తో పాటు ఇది పవర్, సృజనాత్మకత ఫీచర్స్‌ని పుష్ చేస్తుందన్నారు. వినియోగదారులకు అత్యధిక పనితీరుణం అందిస్తూ ఎఐ పవర్ చేసిన కొన్ని పోర్ట్రెయిట్ సామర్థ్యాలను కూడా ఇది అందిస్తుందన్నారు. ఇది మెరుగైన డిస్‌ప్లే లను, ఎన్నడూ చూడని హార్డ్‌వేర్ పనితీరును అందిస్తుందన్నారు. హానర్ 200 ప్రో 5 జి రెండు అందమైన రంగులలో అందుబాటులో ఉంటుందని అవి రూ.57,999 ధరలో ఉంటాయన్నారు.

మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం పూలు కాయగూరల మార్కెట్‌లో రైతులకు సదుపాయాలు కల్పించాలని ఆదుకోవాలని స్వచ్ఛంద సేవకుడు, తల్లువాడ రైతు కోరాడ ఆదినారాయణ కోరారు. నిత్యం ఈ మార్కెట్‌లో పూలుతోపాటు కూరగాయల అమ్మకాల భారీగా జరుగుతాయని, వందలాదిగా రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారులు ఈ మార్కెట్‌కు వస్తున్న నేపథ్యంలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో వారంతా ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. దీంతో రోడ్డుపైనే వ్యాపారాలు చేస్తుండడంతో వారికి ఇబ్బందులతోపాటు ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని, అందుకే ఈ మార్కెట్‌లోపూర్తి సౌకర్యాలను కల్పించాలని కోరారు. అలాగే రైతులకు గిట్టుబాటు ధర కల్పనకు అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

గిరి ప్రదక్షిణకు సర్వం సిద్ధం

- నేడు సాయంత్రం 4 గంటల నుంచి ప్రారంభం
- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, మేయర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, మేయర్

ప్రజాశక్తి- సింహాచలం : ఆషాఢ పౌర్ణమి ముందు రోజున శనివారం జరిగే సింహగిరి ప్రదక్షిణకు సర్వం సిద్ధమైంది. ఉత్కళాంధ్రతోపాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లను ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం, దేవస్థానం సిబ్బంది చేపట్టారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హరింధర ప్రసాద్, నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి పరిశీలించారు. గిరి ప్రదక్షిణ ప్రాంతంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు భద్రత కల్పించారు.ఎక్కడికక్కడఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. జోడుగుళ్లపాలెం వద్ద సముద్ర స్నానం చేసే భక్తులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. గిరిప్రదక్షిణ అనంతరం గిరి తిరగలేని భక్తుల కొరకు సింహగిరిపై ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసేందుకు ఆదివారం ఉదయం తెల్లవారుజామున మూడు గంటలకు ఆలయ ప్రదక్షిణ చేసేందుకు అధికారులు ఏర్పాటు చేశారు ఈ ఏర్పాట్లను శనివారం జిల్లా కలెక్టర్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్, మేయర్ జీవీఎంసీ బందం సింహాచలం కొండపై పర్యటించారు భక్తులకు అసౌకర్యం కలగకుండా తీసుకున్న చర్యలపై కలెక్టర్, మేయర్,ఇతర అధికారులకు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ శ్రీనివాసమూర్తి వివరించారు ప్లైన్ బోర్డులు ఏర్పాటు క్యూలైన్స్ శానిటరీ మంచినీటి సౌకర్యాలు తీసుకోవాలని సూచించారు.కాగా గిరిప్రదక్షిణలో భక్తులకు సేవలు అందించేందుకు, ప్రసాదవితరణకు ఇప్పటికే పలు స్వచ్ఛందసంస్థలు, ప్రజాసంఘాలు, ఆధ్యాత్మిక సంఘాలు అవసరమైన ఏర్పాట్లు చేశాయి.

దారి పొడుగునా అవసరమైన సౌకర్యాలు

ఆరిలోవ : గురుపౌర్ణమి ముందు రోజు జరిగే గిరి ప్రదక్షిణలో నగరంతో పాటు విజయనగరం, శ్రీకాకుళం, ఒడిస్సా రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులకు దేవస్థానం, జివియంసి అధికారులు హనుమంతువాక నుంచి సింహాచలం బిఆర్‌టిఎస్ రోడ్డులో తగు ఏర్పాట్లు చేశారు. బరహదారి పొడవునా మెడికల్ క్యాంపులు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు చేసారు. తాగునీరు, ప్రసాద వితరణ కౌంటర్లును ప్రయివేటు వ్యక్తులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా లుంబినీ పార్కు లోపల నుంచి సముద్ర మార్గంలో ఉన్న గోడను తొలగించారు. వెళ్ళేవారికి, తిరిగి వచ్చేవారికి ఇబ్బందులు లేకుండా బారికేడ్లు నిర్మించారు. భక్తులు స్నానాలు ఆచరించి, దుస్తులు మార్చుకునే అవకాశం ఉన్నందున భక్తుల కోసం దుస్తులు మార్చుకునే గదులను సైతం నిర్మిస్తున్నారు. లుంబినీ పార్కు వద్ద సేదతీరే భక్తులు ఉండేందుకు టెంట్లు ఏర్పాటు చేయనున్నారు.

ఎయు పరిపాలనా భవనం వద్ద ఇనుప గేట్ల తొలగింపు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ: ఆంధ్ర విశ్వ విద్యాలయం ఇన్‌ఛార్జి వీసీగా ఆచార్య జి.శశిభూషణరావు బాధ్యతలు చేపట్టిన తరువాత కొద్ది గంటల్లోనే పలు చర్యలు చేపట్టారు. ఎప్పటి నుంచో ఏయూ ఉద్యోగులు, పెన్షనర్లు ఎదురు చూస్తున్నట్లుగానే వారి జీతాలు, పెన్షన్లను ఖాతాలలో జమ చేసారు. ఉదయం నుంచి ఏయూ పరిపాలనా భవనం ఎదురుగా ఉన్న ఇనుప గేట్లు, కంచెను తొలగించే పనులను ప్రారంభించారు. యుద్ధ ప్రాతిపదికన వీటిని తొలగించి, వర్సిటీ పరిపాలనా భవనంలోనికి విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు స్వేచ్ఛగా వచ్చే విధంగా వెసులుబాటు కల్పించారు. గతంలో ఏర్పాటు చేసిన మూడంచెల భద్రత వలయాన్ని తొలగించాలని విద్యార్థులు, పరిశోధకులు, ఉద్యోగులు, ప్రజలు, ప్రజా ప్రతినిధుల నుంచి విజ్ఞప్తులు వచ్చాయి. ఇంచార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలి సారిగా ఆయన ఈ నిర్ణయాన్ని అమలు చేసారు. వర్సిటీ అధికారులను కలవడానికి ఎవరైనా స్వేచ్ఛగా రావచ్చుననే సందేశాన్ని ఆచార్య జి. శశిభూషణ రావు ఆచరణలో చేసి చూపారు.రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత వీసీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలను తొలిసారిగా ఏర్పాటు చేశారు. పదవీ బాధ్యతలు చేపట్టిన కొద్ది గంటల్లోనే ఈ నిర్ణయాలు తీసుకుని అమలు చేసారు.



గేట్లను తొలగిస్తున్న సిబ్బంది

'గీతం'లో ఎంబిఎ అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి -మధురవాడ :గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ బిజినెస్ నిర్వహిస్తున్న ఎంబిఎ కోర్సులో శుక్రవారం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రవేశాలు పొందిన విద్యార్థులను అభినందించిన గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణిపప్పు మాట్లాడుతూ,. విద్యార్థులలో మేనేజ్‌మెంట్ నైపుణ్యాలను పెంచేవిధంగా ఎనలిటిక్స్, బ్లూమ్‌బర్గ్‌తోపాటు బిజినెస్ ఇంగ్లీషుపై భాషా ప్రయోగశాలను నెలకొల్పామన్నారు. పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా సిలబస్‌లో మార్పులు చేస్తూ, కేస్ స్టడీస్ ఆధారిత విద్యను ప్రవేశపెట్టామని వెల్లడించారు. ఎంబిఎ విద్యార్థులకు ప్రస్తుత పోటీ వాతావరణంలో ఎదిగేలా నైపుణ్యశిక్షణ ఇవ్వడంతోపాటు ప్రతిభ గలవారికి వందశాతం స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నామన్నారు.కార్యక్రమంలో పీజీ.కోర్సుల చైర్‌పర్సన్ డాక్టర్ ఎ.వెంకటేశ్వర్లు, యుజి. కోర్సుల చైర్ పర్సన్ ప్రొఫెసర్ పి. శీలా, అడ్మిషన్ల విభాగం చైర్‌పర్సన్ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, స్టూడెంట్ లైఫ్‌చైర్ పర్సన్ డాక్టర్ కృష్ణకుమారి పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్న గీతం ప్రతినిధులు

ఉత్సవాల ఆదాయం రూ.19.80 లక్షలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:దక్షిణ నియోజక వర్గం పరిధి టౌన్ కొత్తరోడ్‌లో ప్రసిద్ధి చెందిన జగన్నాధ స్వామి దేవస్థానం రథయాత్ర మహోత్సవాలు ముగిసాయి. శుక్రవారం ఉత్సవాలకు సంబంధించిన హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన ఉత్సవ అధికారి కె.శిరీష, ఆలయ ఈఓ. టి.రాజగోపాల్ రెడ్డి, విశాఖ జిల్లా తనిఖీదారు బి.వసంత్ కుమార్, ఉత్సవ్ కమిటీ సభ్యులు ఎస్.రామకృష్ణ, పి.శ్రీధర్, జె.పరశురాం, డి.హరీష్, ఆర్.వెంకటేష్, మణికుమార్, ఈశ్వరమ్మ, ఆదిలక్ష్మి, సుశీల సమక్షంలో హుండీలు తెరిచి లెక్కింపు చేశారు. రథయాత్ర 10 రోజులకుగాను హుండీ ఆదాయం రూ.19 లక్షల,80 వేల 72 వచ్చింది. ప్రతి ఏటా వలె ఈ ఏడాది కూడా రథయాత్ర ఉత్సవాలు పూర్తయిన తర్వాత చేపట్టే మహా అన్నదాన కార్యక్రమం గురువారం దేవస్థానం వద్దనే జరుగుతుందని ఆలయ కార్య నిర్వహణ అధికారి టి.రాజగోపాల్ రెడ్డి తెలిపారు.రథయాత్రకు పూర్తి సహాయ సహకారాలు అందించిన గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థ, పోలీస్ శాఖ, రోడ్లు భవనాల శాఖ, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్, టెలిఫోన్ శాఖ వారికి ధన్యవాదములు తెలిపారు.